విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో విలేకరులుగా పనిచేయడానికి ఆహ్వానిస్తున్నాము. సామాజిక దృక్పదం, అవినీతి, అక్రమాలపై అక్షర గళాన్ని వినిపించే దమ్మున్న విలేకరులు 'అక్షర వెలుగు' తెలుగు దిన పత్రికలో పని చేయడానికి ఈ క్రింది మేయిల్ అడ్రస్‌కు వివరాలను పంపండి

Mail: aksharavelugudaily@gmail.com

8985893382

www.aksharavelugu.com

# అక్షర వెలుగు

జనం కోసం - మన అక్షరం

తెలుగు దిన పత్రిక

ఆది వారం

15. 05. 2022

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్

సంపుటి - 01, సంచిక-79

పేజీలు - 4 వెల రూ. 5

ఎడిటర్ :
గోసుకొండ పృద్విరాజు

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak


## అసమర్థ కెసిఆర్ సర్కార్‌ను పీకి అవతలపడేయండి



- అబద్దాలతో ప్రజలను వంచిస్తున్న దౌర్భాగ్య సిఎం కెసిఆర్
- కెసిఆర్‌ను గద్దె దించేందుకు బండి సంజయ్ చాలు
- నీళ్లు, నిధులు, నియామకాల హామీలు వమ్ముచేశారు
- తెలంగాణకు 8ఏళ్లో రూ.2.52 లక్షల కోట్లు ఇచ్చాం
- కేంద్ర పథకాలకు తండ్రీ కొడుకుల ఫోటోలతో పోజులు
- ధాన్యం ధరలు పెంచికొంటున్నా అబద్దాల ప్రచారం
- కారు స్టీరింగ్ మజ్లిస్ చేతిలో ఉంది..అందుకే విమోచనకు దూరం
- ప్రజల సంక్షేమం లక్ష్యం కోసమే బండి సంజయ్ ప్రజా సంగ్రామ యాత్ర
- తుక్కుగూడ ముగింపు సభలో అమిత్ షా నిప్పులు

**హైదరాబాద్, మే 14 (అక్షర వెలుగు):** తెలంగాణలో అసమర్థ కెసీఆర్ సర్కార్‌ను కూకటివేళ్లతో పెకిలించి వేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. ఇక్కడ స్టీరింగ్ మజ్లిస్ చేతుల్లో ఉందన్నారు. అభివృద్ధిని పట్టని, అబద్దాల ప్రభుత్వం అసవరం లేదన్నారు. ఎప్పుడు ఎన్నికలు పెట్టినా కెసిఆర్‌ను గద్దె దించేందుకు బిజెపి సిద్దంఆ ఉండాని అమిత్ షా అన్నారు. కేసీఆర్‌ని ఓడగొట్టడానికి తాను రావాల్సిన అవసరం లేదని బండి సంజయ్ ఒక్కరే చాలన్నారు. కేవలం ఓ పార్టీని దించి మరో పార్టీని అధికారంలో తేవడానికో, ఒకరిని ముఖ్యమంత్రిని చేయడానికో కాదని ఆయన స్పష్టం చేశారు. తుక్కుగూడలో బీజేపీ నిర్వహించిన 2

## దేశానికి హైదరాబాద్ ఓ పెద్ద అసెట్ కానుంది

### సుంకిశాల లిఫ్ట్‌కు శంకుస్థాపనలో మంత్రి కెటిఆర్ హామీ

- హైదరాబాద్ మంచి నీటికి భరోసా
- సుంకిశాల నిర్మాణంతో సిటీ నీటికి ఢోకా లేదు
- 2072 నీటి అవసరాల మేరకు లభ్యత
- హైదరాబాద్ వందకిలోమీర్ల పరిధి వరకు నీటి సరఫరా
- కెసిఆర్ లాంటి దార్శనిక నేతతో సమస్యలకు పరిష్కారం



**నల్లగొండ, మే 14 (అక్షర వెలుగు):** హైదరాబాద్ నగరానికి 2072 వరకు తాగునీటికి ఇబ్బందుల్లేకుండా ముందుచూపుతో ప్రణాళికలు రూపొందించామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. వరుసగా ఏడేండ్లు కరువు వచ్చినా తాగునీటికి తిప్పలు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హైదరాబాద్ చుట్టు కూడా వాటర్ పైప్ లైన్‌లను ఏర్పాటు చేశారు. భవిష్యత్‌లో హైదరాబాద్ నగరం 100 కిలోమీటర్ల విస్తరించినా తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వెలుపలా, బయట ఉన్న ప్రాంతాలకు కూడా తాగు నీటిని అందించేలా ప్లాన్ చేశామన్నారు. హైదరాబాద్ 2

## ఢిల్లీ అగ్నిప్రమాదం ఘటనలో ఇద్దరి అరెస్టు



- పరారీలో బిల్డింగ్ ఓనర్ మనీష్ లక్రా
- ఘటనా స్థలిని పరిశీలించిన సిఎం కేజ్రీవాల్
- మృతుల కుటుంబాలకు 10లక్షల చొప్పన సాయం
- 2లక్షల చొప్పన సాయం ప్రకటించిన ప్రధాని

**న్యూఢిల్లీ, మే 14 (అక్షర వెలుగు):** ఢిల్లీ అగ్నిప్రమాదం ఘటనలో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. మొత్తం ముగ్గురిపై కేసు నమోదు చేశారు. సీసీ కెమెరాలు, రూటర్ ఆఫీస్ ఓనర్లు హరీశ్ గోయల్, వరుణ్ గోయల్ ను అదుపులోకి తీసుకున్నారు. బిల్డింగ్ ఓనర్ మనీష్ లక్రా పరారీలో ఉన్నారు. అగ్నిమాపక శాఖ నుంచి సేఫ్టీ క్లియరెన్స్ లేదని అధికారులు గుర్తించారు. దేశ రాజధాని దిల్లీలో శుక్రవారం జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో 3

## కేంద్ర ప్రభుత్వ హామీలన్నీ బూటకం

- కసిఆర్ అవినీతిపై ఎందుకు ఉపేక్షిస్తున్నారు
- కాళేశ్వరం అవినీతిపై విచారణకు ఎందుకు ఆదేశించరు
- నిజామాబాద్ పసుపుబోర్డు హామీ ఎందుకు విస్మరించారు
- తెలంగాణ విభజన సమస్యలపై ఎందుకు మాటతప్పారు
- అమిత్‌షాకు 9 ప్రశ్నలతో బహిరంగ లేఖ విడుదల చేసిన రేవంత్



**హైదరాబాద్, మే 14 (అక్షర వెలుగు):** మాటలు కోటలు దాటుతున్నాయి.. చేతలు గడప దాడటం లేదన్న సామెత కేంద్ర ప్రభుత్వానికి అతికినట్లు సరిపోతుందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి విమర్శించారు. 2022 నాటికి దేశంలో రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న కేంద్ర ప్రభుత్వ హామీ ఒట్టి బూటకమని అర్థమైందన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల తర్వాత మూడోసారి ఇవాళ 3

## సైద్ధాంతిక భావజాలాన్ని నమ్ముకున్న బిజెపి

- తెలంగాణలో దూకుడు రాజకీయాలతో ముందుకు
- సమస్యలపై గట్టిగా నిలదీస్తున్న అధికార టిఆర్ఎస్
- సూటిగా అడిగిన ప్రశ్నలకు కూడా సమాధానం కరవే



**న్యూఢిల్లీ, మే 14 (అక్షర వెలుగు):** భారతీయ జనతా పార్టీకి ఒక సైద్ధాంతిక భూమిక ఉన్నది. పద్ధతి ప్రకారం అది తన సిద్ధాంతాన్ని జనంలోకి చొచుకునిపోయేలా చేస్తున్నది. కాంగ్రెస్ వారసత్వాన్నీ, సిద్ధాంతాన్నీ, ఆ పార్టీ నేతలను చరిత్ర పుటల్లోంచి తొలగించి తన సిద్ధాంతాన్ని, భావ జాలాన్ని ప్రవేశ పెట్టేందుకు బిజెపి పకడ్బందీగా పనిచేస్తోంది. కాంగ్రెస్ పార్టీకి ఓటు బ్యాంకు 2

## స్వల్పంగా తగ్గిన బంగారం,వెండి ధరలు

22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.47,200



**ముంబై, మే 14 (అక్షర వెలుగు):** శుక్రవారంతో పోలిస్తే.. శనివారం నాటికి తెలుగు రాష్ట్రాల్లో బంగారం ధరలు భారీగా తగ్గాయి. పది గ్రాముల బంగారంకు దాదాపు రూ. 750 వరకు తగ్గింది. ఇక వెండి విషయానికిస్తే కిలోకు రూ. 1,600 తగ్గింది. హైదరాబాద్ మార్కెట్లో శుక్రవారం 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 47,200 ఉండగా, 2

## తెలంగాణకు కేంద్రం గుడ్ న్యూస్

### మరో 6.5 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణ



**న్యూఢిల్లీ, మే 14 (అక్షర వెలుగు):** తెలంగాణ నుంచి అదనంగా మరో 6.5 లక్షల మెట్రిక్ టన్నుల ఫోర్టిఫైడ్ పారా బాయిల్డ్ బియ్యం సేకరించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వానికి సమాచారం ఇచ్చింది.వరి ధాన్యం, ఉప్పుడు బియ్యం కొనుగోలు విషయంలో తెలంగాణ వర్సెస్ కేంద్ర ప్రభుత్వాలుగా పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. అయితే తాజాగా.. ఈ విషయంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ నుంచి మరో 6.5 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ బియ్యం సేకరించాలని మోదీ సర్కార్ నిర్ణయించింది. ఈ మేరకు శనివారం నాడు ఓ ప్రకటన రూపంలో కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. బియ్యం భారత ఆహార సంస్థ (ఈఅఐ) కు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం సమాచారం పంపింది. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకునే ఈ అవకాశం కల్పించినట్లు కేంద్రం ఆ ప్రకటనలో పేర్కొన్నది.

## పసుపుబోర్డు చుట్టూ జిల్లా రాజకీయాలు

- ఎంపి అర్వింద్‌కు ఊపిరి సలుపకుండా విమర్శలు
- బోర్డు విషయంలో సమాధానం చెప్పకోలేక ఎంపి అవస్థలు



**నిజామాబాద్, మే 14 (అక్షర వెలుగు):** నిజామబాద్ జిల్లాలో పసుపుబోర్డు చుట్టూ రాజకీయాలు నడుస్తున్నాయి. పసుపు బోర్డు తెస్తానని హామిఇచ్చి ఎన్నికైన ఎంపీ ధర్మపురి అర్వింద్ లక్ష్యంగా టిఆర్ఎస్ పోరాటం చేస్తున్నది. దీనికితోడు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన ఐదేరోజుల్లో నిజామాబాద్ జిల్లాకు పసుపుబోర్డు తెస్తానంటూ అర్వింద్ బాండ్ పేపర్లపై రాసివ్వడం అప్పట్లో సంచలనంగా మారింది. అదే ఇప్పుడు ఆయనను నిలదీసేలా చేస్తోంది. అర్వింద్ ఎంపిగా ఎన్నికై 3

## ఆందోళనకరంగా దేశ ఆర్థిక వ్యవస్థ

ఉదాసీనంగా కేంద్ర ప్రభుత్వం తీరు ● మీడియాతో మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం



**ఉదయ్‌పూర్, మే 14 (అక్షర వెలుగు):** దేశఆర్థిక వ్యవస్థ పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా ఉందని కాంగ్రెస్ సీనియర్ నేత పి చిదంబరం చెప్పారు. ఆర్థికసంక్షోభం విషయంలో మోడీ సర్కార్ నిర్లిప్తత అవలంబిస్తోందని అన్నారు. దీనిని పరిష్కరించే చర్యల విషయంలో ఉదాసీనత కనిపిస్తోందని అన్నారు. కాంగ్రెస్ మేధోమథనం సమావేశాల నేపథ్యంలో శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జాతీయ, అంతర్జాతీయ 3

## హైదరాబాద్ చేరుకున్న అమిత్ షా

ఘనంగా స్వాగతించిన కిషన్ రెడ్డి తదితరులు



**హైదరాబాద్, మే 14 (అక్షర వెలుగు):** కేంద్ర హోం మంత్రి అమిత్ షా హైదరాబాద్ చేరుకున్నారు. దిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట్ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు భాజపా నేతలు ఘన స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పార్టీ నేతలు ధర్మపురి అర్వింద్, రఘునందన్ రావు, రాజాసింగ్, పొంగులేటి సుధాకర్, సోయం బాపురావు, విజయ శాంతి, లక్ష్మణ్, వివేక్ వెంకట స్వామి, ఇంద్ర సేనా రెడ్డి, డీకే అరుణ తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం బేగంపేట్ నుంచి రామంతపూర్‌లోని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబోరేటరీకి బయలుదేరారు. అక్కడ నేషనల్ సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం శంషాబాద్‌లోని నోవాటెల్‌కు హోటల్‌కు వెళ్లారు. అమిత్‌షాకు స్వాగతం పలికిన భాజపా నేతలురంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో సాయంత్రం 6 గంటలకు జరగనున్న భాజపా బహిరంగ సభలో అమిత్ షా పాల్గొంటారు. బండి సంజయ్ ప్రజా సంగ్రామ యాత్ర ముగింపు సందర్భంగా తుక్కుగూడలో భారీ సభ ఏర్పాటు చేశారు. ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాల్లో 31 రోజులపాటు సుమారు 400 కి.మీకు పైగా బండి సంజయ్ పాదయాత్ర కొనసాగింది.

## చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ రాజీనామా

కమ్యూనిస్ట్ పార్టీ కీలక నిర్ణయం ● సోషల్ మీడియా వేదికగా జోరుగాప్రచారం



**బీజింగ్, మే 14 (అక్షర వెలుగు):** చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పదవి నుంచి తప్పుకోబోతున్నారని అక్కడి సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. కరోనా నిర్వహణలో పూర్తిగా విఫలం కావడమే కాకుండా, చైనా ఆర్థిక వ్యవస్థ పడిపోవడానికి జిన్‌పింగ్ తప్పుడు నిర్ణయాలు తీసుకున్నారని, అందుకే ఆయనను చైనా కమ్యూనిస్టు పార్టీ(సీపీసీ) పక్కకు పెట్టబోతోందని వదంతులు వ్యాపిస్తున్నాయి. సీపీసీ పొలిట్ బ్యూరో స్టాండింగ్ కమిటీ సమావేశం అనంతరం ఈ ప్రచారం మొదలైంది. చైనా పాలనలో ఈ నాయకత్వ బృందమే అత్యంత కీలకం. ఈ సమావేశం అనంతరం కెనడాకు చెందిన బ్లాగర్ ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశాడు. చైనా కమ్యూనిస్టు పార్టీ.. కొద్ది నెలల్లో కీలక సమావేశాన్ని నిర్వహిస్తుందని, ఆ లోపే జిన్‌పింగ్‌ను పదివి నుంచి తప్పుకోవాలని ఆదేశించిందని చెప్పాడు. అంతేకాదు ప్రస్తుత ప్రీమియర్ లీ కెకియాంగ్‌ను తదుపరి చైనా అధ్యక్షుడిగా పార్టీ నియమిస్తుందని పేర్కొన్నాడు. పార్టీ నుంచి, పదవి నుంచి జిన్‌పింగ్ వైదొలుగుతారని వివరించాడు. కరోనా కట్టడి కోసం జీరో కొవిడ్ పాలసీ పేరుతో అత్యంత కఠిన ఆంక్షలు విధించారు జిన్‌పింగ్. దీనిపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. అంతేగాక వ్యాపార సంస్థలపై కూడా ఆంక్షల వల్ల తీవ్ర ప్రభావం పడింది. దీంతో చైనా ఆర్థిక వ్యవస్థ పడిపోయింది. ప్రపంచ ఆర్థికవ్యవస్థ కూడా ప్రభావితమైంది. చైనా యువాన్ విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో 4శాతం వరకు పడిపోయింది. గత 28ఏళ్లలో ఇంత కనిష్ఠానికి పడిపోవడం ఇదే తొలిసారి. కరోనా ఒక్క కారణం తప్ప ఆర్థిక వ్యవస్థ గురించి జిన్‌పింగ్ ఆలోచించలేదని, ప్రజలను ఇబ్బందిపెట్టడమే గాక ఆర్థిక వ్యవస్థ పడిపోవడానికి కారణమయ్యారని విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఆయన పదవి నుంచి వైదొలుగుతారని ప్రచారం జరుగుతోంది.

## రాజన్నను సందర్శించిన డిజిపి మహేందర్ రెడ్డి



**వేములవాడ, మే 14 (అక్షర వెలుగు):** వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డ్ చైర్మన్ కోలేటి దామోదర్‌తో కలిసి రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అద్దాల మండపంలో స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందించారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలో ఎస్పీ రాహుల్ హెగ్డే ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వేములవాడ డీఎస్పీ చంద్రకాంత్, పట్టణ సీఐ వెంకటేశ్, ఆలయ ధికారులు పాల్గొన్నారు.

## సెంట్రల్ ఫోరెన్సిక్ ల్యాబ్ కు అమిత్ షా ప్రారంభం



**హైదరాబాద్, మే 14 (అక్షర వెలుగు):** రామంతపూర్ లోని సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ కు కేంద్ర మంత్రి అమిత్ షా చేరుకున్నారు. ఈ క్రమంలో సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ నూతన ల్యాబ్స్ ను అమిత్ షా ఆవిష్కరించారు. అనంతరం ల్యాబంతా కలియదిరిగారు. ఈ సందర్భంగా డివైసెస్ పనితీరును సైంటిస్టులను అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాలు రోజు రోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో... వాటికి అడ్డుకట్ట వేసేందుకు ఈ ఎక్విప్ మెంట్ ఉపయోగపడనుందని సైంటిస్టులు ఆయనకు తెలిపారు. అనంతరం నోవాటెల్ హోటల్ కు మంత్రి అమిత్ షా బయలుదేరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, సైంటిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# దేశంకోసం కాంగ్రెస్ చింతన అవసరం !

కాంగ్రెస్ పార్టీ రెండురోజుల శిబిరం చింతన శివిర్ రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లో జరుగుతోంది. ఈ శిబిరంలో దేశానికి రాజకీయంగా ప్రత్యమ్నాయశక్తిగా ఎలా అవతరించాలో..ప్రజలకు అండగా ఉండడానికి..వారిలో నమ్మిక కలిగించడానికి ఎలాంటి చర్యలకు ఉపక్రమించాలో చర్చించాలి. గతంలో చేసినపాపాలను ప్రక్షాళన చేసుకుని, దేశానికి దిశదశను చూపే దార్శనికతను ప్రదర్శించాలి. అధికారంలో ఉన్న బిజెపి మైనార్టీలను అణచివేస్తున్నారనీ, గాంధీజీని హత్య చేసిన వాళ్లను కీర్తిస్తున్నారంటూ కేంద్ర సర్కార్‌పై కాంగ్రెస్ అధ్యక్షు రాలు సోనియాగాంధీ విమర్శనాస్త్రాలు సంధించడం ద్వారా లాభం లేదు. అలా అయితే కాంగ్రెస్ హయాం లో హిందువులు ఊచకోతకు గురయ్యారు. ప్రజల మధ్య విభేదాలు సృష్టించడం, మైనారిటీలపై క్రూరంగా దాడులు చేయడం, రాజకీయ ప్రత్యర్థులను బెదిరించడమేనా అని మోడీ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేయడం ద్వారా గత పాపాలను కడిగేసుకోలేమని కాంగ్రెస్ గుర్తించి ఉంటే బాగుండేది. బలమైన ప్రత్యామ్నాయ రాజకీయ విధానాన్ని రూపొందించి జనంలోకి తీసుకువెళ్లగలిగిన నేతలు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి తక్షణ అవసరం. విచిత్రమేమంటే కాంగ్రెస్ పార్టీ తాను ఏమిచేయాలో తెలుసుకోలేని పరిస్థితిలో ఉన్నది. మోడీ చేస్తున్న ప్రజా కంటక పాలన గురించి గట్టిగా చర్చించి ఓ రాజకీయ సందేశం ఇవ్వాల్సన అవసరం ఉంది. అదికూడా ప్రజలు నమ్మగలగాలి. దేశ సమస్యలను ఆకళింపు చేసుకుని, వాటి పరిష్కారానికి మార్గాలను సూచించి గట్టిగా వివరించే సమర్థమైన నేతలు ఎవరూ కాంగ్రెస్‌లో లేరు, వారసత్వ బలహీనత లనుంచీ, వంధిమాగధత్వం నుంచీ, కోటరీల ద్వారా రాజకీయాలు చేసే స్వార్థపర నేతలనుంచీ, ఒకర్నొకరు వెన్ను పొట్లు పొడుచుకునే సంస్కృతి నుంచీ, పైరవీ కారులనుంచీ, దళారులనుంచీ కాంగ్రెస్ తనను తాను వదుల్చుకోలేకపోతున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే కాంగ్రెస్ సమకాలీనత్వాన్ని కోల్పోతున్నది. పూర్తిగా తనను ప్రక్షాళనం చేసుకొని, కాయకల్ప చికిత్స జరిపించుకుని జనంలోకి వెళ్లగలిగే నేతల్ని, కార్యకర్తల్ని తయారు చేసుకున్నప్పుడే కాంగ్రెస్ జీవించగలదు. దీనిని గుర్తించడంలోనూ కాంగ్రెస్ సిద్దంగా లేదు. దేశంలో ప్రజలు నిత్యం భయం, అభద్రతల మధ్య నలిగిపోయేలా మోడీ పరిపాలన ఉందంటూ సోనియా చేసిన వ్యాఖ్యల్లో ఎక్కడా నిజం లేదు. ప్రజల మధ్య ఐక్యతను బలహీన పరుస్తున్నారని, మతపరమైన విభజనను ఎదుర్కొని దేశాన్ని పునర్మించాలనే లక్ష్యంతో మున్ముందు పనిచేయాలని సోనియా నిర్దేశించ డంలోనూ అర్థం లేదు. నిజానికి మోడీపై వ్యతిరేకత ఇంకో రూపంలో ఉంది. ధరలు, నిరుద్యోగం, పెట్రో, గ్యాస్ ధరల పెంపు, జిఎస్టీ వాయింపులు, ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మడం వంటివి ముఖ్యం. వీటిని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ తనవద్ద ఉన్న ప్రణాళికలను ప్రజలకు వివరించాలి. ఇకపోతే కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత మార్పులు సత్వరమే చేపట్టాల్సిన అవసరం కూడా ఉంది. దేశంలోని సమస్యలను చర్చిచేందుకు, ఆత్మశోధన అర్థవంతంగా కొనసాగేందుకు ఓ గొప్ప అవకాశంగా భావిస్తున్నట్టు సోనియా పేర్కొన్నారు.

ఈ క్రమంలో దేశానికి ఏంచేయబోతున్నారో చెప్పాలి. వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, ఆమె తనయుడు రాహుల్ గాంధీ, తనయ ప్రియాంకాగాంధీతో సహా హేమాహేమిలందరూ చింతన్‌లో పాల్గొంటున్నారు. కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ ప్రశ్నార్థకమైన తర్వాత దిక్కు తోచని స్థితిలో పార్టీ నేతలు ఉన్నారు. సోనియా మాటలు వినేందుకు ముందుకు వచ్చారు. అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో పరాజయం చెందిన తర్వాత కాంగ్రెస్ నిజంగానే దిక్కుతోచని స్థితిలోకి వెళ్లింది. ఇది తల్లీ కూతుళ్లకు, తల్లీ తనయులకు తెలియనివి కావు. పార్టీ అధిష్ఠానం ప్రజలతోనూ, కార్యకర్తలతోనూ సంబంధాలు కోల్పోయింది. దేశంలో దాదాపు 200 సీట్లలో కాంగ్రెస్ పోటీచేసి కూడా ప్రయోజనం లేకుండా పోయిందని ఇటీవలి ఎన్నికలు నిరూపించాయి. ఇప్పటికే కాంగ్రెస్ జాతీయ స్థాయిలో బిజెపితో రెండు యుద్దాలు చేసి ఓడి పోయింది. పోటీ చేసిన ప్రతి రాష్ట్రంలోనూ, ప్రతి ఎన్నికలోనూ పార్టీ దెబ్బతింటూ వస్తోంది. దేశంలో అతి పెద్ద రాష్ట్రం అయిన ఉత్తర ప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ కేవలం 2.32 శాతం మాత్రమే సంపాదించింది. ఉత్తరాఖండ్‌లో అధికారంలో ఉన్న బిజెపిని ఓడించే పరిస్థితులు ఉన్నప్పటికీ గెలిపించగల నాయకత్వం లేదని రుజువు చేసుకుంది. పంజాబ్‌లో ఆఖరి రోజుల్లో ముఖ్యమంత్రిని తొలగించి, ఆచరణ సాధ్యం కాని ప్రయోగాలు చేసి కుప్పకూలిపోయింది. 30 మంది కాంగ్రెస్ అభ్యర్థులు పంజాబ్‌లో డిపాజిట్ కోల్పోయారు. పదేళ్ల క్రితం కాంగ్రెస్ అధికారంలో ఉన్న అనేక రాష్ట్రాల్లో ఆ పార్టీ పరిస్థితి అగమ్య గోచరంగా ఉన్నది. 2014లో కాంగ్రెస్ 13 రాష్ట్రాల్లో అధికారంలో ఉండేది. ఇప్పుడు కేవలం రెండు రాష్ట్రాలకే పరిమితమైంది. 2013కు ముందు 15 సంవత్సరాల పాటు కాంగ్రెస్ ఢిల్లీలో అధికారంలో ఉండేది. 2020 ఎన్నికల్లో ఆ పార్టీకి ఢిల్లీలో కేవలం 5 శాతం ఓట్ల కంటే తక్కువ వచ్చాయి. 63 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పూర్తిగా తుడిచిపెట్టుకుని పోయింది. ఢిల్లీ, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, ఒడిషా, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ తలరాతని మార్చగలగిన శక్తి ఇప్పుడున్న ముగ్గురు నేతలకు లేదు. అయితే కాంగ్రెస్ ఇప్పటికీ మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, హర్యానా, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఎంతో కొంత బలంగా ఉన్నది. ఈ రాష్ట్రాల్లో గెలిచేం దుకు ఏమి చేయాలో ఆ పార్టీ తీవ్రంగా చర్చించవలిసి ఉన్నది. క్రింది స్థాయి నుంచి పార్టీలో జవజీవాలు కల్పించాల్సి ఉన్నది. గ్రామ స్థాయినుంచి పార్టీని బలోపేతం చేయాల్సి ఉన్నది. దళితులు, వెనుకబడిన వర్గాలు మళ్లీ కాంగ్రెస్ పట్టులోకి వచ్చేందుకు ఏమిచేయగలమా అని ఆ పార్టీ నేతలు ఆలోచించాల్సి ఉంది. కాంగ్రెస్ పార్టీ జనంలో కదలిక తేగలిగిన పరిస్థితిలో ఉన్నదా లేదా, తెచ్చేందుకు ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి అని ఆ పార్టీ నేతలే చర్చించుకోవాలి. జనంలో కదలిక రావాలంటే జనాన్ని ఆలోచింపచేసే ఒక సిద్దాంతం, లేదా నినాదం అవసరం. అందుకు చింతన్ శిబిరం ఏ మేరకు కృషి చేస్తుంద న్నది ముఖ్యం. ఎలాంటి నిర్ణయాలు తీసుకుని వెళితే ప్రజలు నమ్ముతారన్నది ముఖ్యం. ఆ దిశగా ఆలోచన చేయాలి. లేకుంటే కాంగ్రెస్ చరిత్రపుటల్లో మాత్రమే కనిపిస్తుంది.

**పృధ్విరాజ్ గోసుకొండ**
**ఎడిటర్**

# త్రిపుర నూతన సీఎంగా మాణిక్ సాహు

### బిప్లవ్ రాజీనామాతో నూతన నేతగా ఎన్నిక



**అగర్తల, మే 14 (అక్షర వెలుగు):** త్రిపుర రాష్ట్రంలో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. శనివారం సీఎం పదవికి బిప్లవ్ కుమార్ దేవ్ రాజీనామా చేశారు. పార్టీ జాతీయ నాయకత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు ఆయన రాజీనామా చేసినట్లు సమాచారం. అనంతరం బీజేఎల్పీ అత్యవసరంగా సమావేశమైంది. ఈ మీటింగ్ లో మాణిక్ సాహను నూతన సీఎంగా ఎన్నుకున్నారు. బీజేపీ త్రిపుర శాఖ అధ్యక్షులుగా కొనసాగుతున్న సాహ... రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. వచ్చే సంవత్సరం త్రిపుర రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న క్రమంలో.. ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. ప్రతి దానికి ఓ నిర్ణీత కాలం ఉంటుందని.. తాము ఆ కాలాన్ని బట్టి పని చేయడం జరుగుతుందని రాజీనామా చేసిన అనంతరం బిప్లబ్ కుమార్ మీడియాకు తెలిపారు. తనకు ఏ పదవి ఇచ్చినా.. బాధ్యతతో పని చేస్తానని, ముఖ్యమంత్రి పదవి అయినా.. వేరేదైనా.. తాను అందుకు తగినట్లు వ్యవహరిస్తానన్నారు. త్రిపురలో గత కొన్ని ఏళ్లుగా కమ్యూనిస్టు ప్రభుత్వం ఉందనే సంగతి తెలిసిందే. ఈ పాలనకు తెరదించుతూ.. బీజేపీ ప్రభుత్వం 2018లో అధికారాన్ని చేజిక్కించుకుంది. రాష్ట్ర పదో ముఖ్యమంత్రిగా బిప్లబ్ కుమార్ ప్రమాణం చేశారు. ఆయనపై ప్రతిపక్షాలు ఆరోపణలు, విమర్శలు గుప్పించాయి. ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న క్రమంలో సీఎంను మార్చాలని బీజేపీ అధిష్టానం నిర్ణయించడం గమనార్హం. మరి మాణిక్ సాహ పాలన ఎలా ఉంటుందో వేచి చూడాలి.

# దేశానికి హైదరాబాద్ ఓ పెద్ద అసెట్ కానుంది



(మొదటి పేజీ తరువాయి..) మహానగరం తెలంగాణకు రాజధాని అయినప్పటికీ.. భారతదేశానికి ఒక అసెట్ అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. అలాంటి హైదరాబాద్ మహానగరాన్ని భవిష్యత్ తరాలకు బ్రహ్మాండమైన అసెట్‌గా అందించాలని, భవిష్యత్ భారతావనికి ఒక దిక్సూచిగా ఉండే విధంగా భాగ్యనగరంలో కార్యక్రమాలు చేయాలని, ఆ విధంగా తీర్చిదిద్దాలని సీఎం కేసీఆర్ తమకు ఎప్పుడూ చెప్తుంటారని కేటీఆర్ వెల్లడించారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల నిమిత్తం.. నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ వద్ద సుంకిశాల ఇన్‌టెక్ వెల్‌కు శంకుస్థాపన చేసిన సందర్భంగా మంత్రి కేటీఆర్ ప్రసంగించారు.కేసీఆర్ లాంటి దార్శనికత ముఖ్యమంత్రి ఉండటం వల్ల ఏడేండ్లలో ఎన్నో సమస్యలను పరిష్కారం అయ్యాయని కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల నిమిత్తం.. నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ వద్ద సుంకిశాల ఇన్‌టెక్ వెల్ పనులకు కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ రంగారెడ్డి మేడ్చల్ జిల్లాల ప్రజలకు నిజంగా ఇవాళ శుభదినం అని పేర్కొన్నారు. మెట్రో వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డు ఆధ్వర్యంలో రూ. 6 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుత హైదరాబాద్‌లో నీటి అవసరాలు 37 టీఎంసీలు.. 2072 వరకు ఆలోచిస్తే ఇది పెరిగి మరో 34 టీఎంసీల అవసరం ఉంటుంది. దాదాపు 71 టీఎంసీల నీరు అవసరం ఉండే అవకాశం ఉంది. 2035 నాటికి 47 టీఎంసీలు, 2050 నాటికి 58 టీఎంసీలు, 2065 నాటికి 67 టీఎంసీలు, 2072 నాటికి 70.97 టీఎంసీల నీరు అవసరం ఉంటుందని అంచనా వేశామన్నారు. సుంకిశాలలో 1450 కోట్ల అంచనా వ్యయంతో తాగునీటి అవసరాల నిమిత్తం పంపులు, మోటార్లతో పాటు అదనంగా 16 టీంఎసీలు లిఫ్ట్ చేయడానికి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రాబోయే ఎండకాలం నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేసి హైదరాబాద్ ప్రజలకు తాగునీరు అందిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్న మహానగరమని అన్నారు. భౌగోళికంగా హైదరాబాద్‌కు చాలా అనుకూలతలు ఉన్నాయన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వెలుపులా, బయట ఉన్న ప్రాంతాలకు కూడా తాగు నీటిని అందించేలా ప్లాన్ చేశామన్నారు. సిటీ ఎంత విస్తరించినా నీటి కొరత లేకుండా సుంకిశాల ప్రాజెక్టును చేపడుతున్నామన్నారు. రూ.1450 కోట్లతో ఈప్రాజెక్టును నిర్మిస్తున్నామన్నారు. వరుసగా ఏడేళ్లుగా కరువు వచ్చినా తాగు నీటికి తిప్పలు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాబోయే వేసవి కాలం వరకు ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. అదనంగా పదహారున్నటీఎంసీల నీటిని లిఫ్ట్ చేయడానికి ఈ ఇన్ టెక్ వెల్ ను నిర్మిస్తున్నామన్నారు. మోటార్లు పెట్టి నీటిని పంపింగ్ చేసేలా కూడా సివిల్ వర్క్ జరుగుతున్నా యన్నారు. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, జిల్లాల ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరమన్నారు. దేశంలో వేగంగా ఎదుగుతున్న మహానగరం ఏదంటే హైదరాబాద్ అని చెప్పొచ్చు. హైదరాబాద్ శర వేగంగా పెరుగుతున్నది, విస్తరిస్తున్నదని తెలిపారు.15 సంవత్సరాల కాలంలో ఢిల్లీ తర్వాత హైదరాబాద్ రెండో అతిపెద్ద నగరంగా ఆవిర్భవిస్తుందంటే.. ఇది అతిశయోక్తి కాదననారు. నేను చెప్పేది ఏదో కల్పన కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఎందుకంటే మనం ఇప్పటికే ఎయిర్ ట్రాఫిక్‌లో నాలుగో స్థానానికి చేరుకున్నాం. ఢిల్లీ, ముంబై, బెంగళూరు తర్వాత మనమే ఉన్నాం. చెన్నై, కోల్‌కతాను దాటిపోయామని కేటీఆర్ పేర్కొన్నారు. మిగతా ఏ నగరాలకు లేని భౌగోళిక, పర్యావరణ అనుకూలతలు హైదరాబాద్‌కు ఉన్నాయి. నాలుగు వైపులా నగరం పెరుగుతోందని కేటీఆర్ స్పష్టం చేశారు. భారతదేశంలోని ఇతర మహానగరాల్లో రకరకాల కారణాల వల్ల ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని కేటీఆర్ గుర్తు చేశారు. రైలు ట్యాంకర్లలో నీళ్లు తెచ్చే దుస్థితి ఒక నగరంలో ఉంది. పెరుగుతున్న ధరల కారణంగా మరో నగరం విస్తరించే అవకాశం లేదు. మరొక నగరంలో పొల్యూషన్ సమస్య, ఇంకో నగరంలో ట్రాఫిక్ సమస్య విపరీతంగా ఉంది. ఇలా అనేక సమస్యలతో దేశంలో నగరాలు సతమతమవుతున్న వేళ.. కానీ హైదరాబాద్‌కు అన్ని రకాల అనుకూలతలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జగదీశ్వర్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస యాదవ్,శ్రీనివాస గౌడ్,మహ్మూద్ అలీ,మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సైద్ధాంతిక భావజాలాన్ని నమ్ముకున్న బిజెపి

(మొదటి పేజీ తరువాయి..)అయిన దళితులు, ఆదివాసీలను తన వైపుకు తిప్పుకునేందుకు, ఓబీసీలను ఆకర్షించేందుకు బిజెపి పద్ధతి ప్రకారం ప్రయత్నిస్తోంది. అదే ఇప్పుడు కాంగ్రెస్‌ను పూర్తిగా దెబ్బతీసి బిజెపిని బలపడేలా చేస్తోంది. కరిమింగిన వెలగపండులా కాంగ్రెస్ డొల్లగా మారినా ఈ నిజాన్ని గుర్తించడం లేదు. ప్రతి రాష్ట్రంలోనూ పలుకుబడిగల వివిధ వర్గాల నేతలు బిజెపిలో చేరేందుకు ఉత్సుకత ప్రదర్శిస్తున్నారు. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన రూ.3 వేల కోట్లకు పైగా ఉన్న ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్ల బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారని నిలదీశారు. వెనుకబడి ప్రాంతాల అభివృద్ధి గ్రాంటు రూ.1350 కోట్లు, జీఎస్టీ పరిహారం రూ.2247 కోట్ల జీఎస్టీ పరిహారం సంగతేమిటని కవిత ప్రశ్నించారు. గత ఎనిమిదేండ్లలో తెలంగాణకు ఒక్క ఐఐటీ, ఐఐఎం, ఐఐఎస్ఈఆర్, ట్రిపుల్ ఐటీ, ఎన్ఐడీ, మెడికల్ కాలేజీలు, నవోదయ పాఠశాలలు ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం ఎందుకు విఫలమైందో తెలంగాణ బిడ్డలకు వివరించాలని కవిత డిమాండ్ చేశారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథకు రూ.24 వేల కోట్లు ఇవ్వాలన్న నీతి ఆయోగ్ సిఫార్సును కేంద్ర ప్రభుత్వం ఎందుకు విస్మరించిందో చెప్పాలని కోరారు. కర్ణాటకలోని ఎగువ భద్ర నీటిపారుదల ప్రాజెక్టుకు, కెన్ బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుకు జాతీయ ప్రాజెక్టు హోదా కల్పించి, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా నిరాకరించడం కేంద్రప్రభుత్వం కపటత్వం కాదా? అంటూ ఎమ్మెల్సీ కవిత ట్వీట్ చేశారు. అంతేకాదు బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పెరిగిన నిరుద్యోగం, మతపరమైన అల్లర్లపై, భారత్‌ను అత్యంత ఖరీదైన ఇంధనం, ఎల్‌పీజీని విక్రయించడంలో అగ్రగామి దేశంగా మార్చడంపై, ఆకాశాన్ని తాకుతున్న ద్రవ్యోల్బనంపై మీ సమాధానం ఏమిటని కేంద్ర మంత్రి అమిత్ షాను ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు.

### ట్విట్టర్ వేదికగా ధర్మపురి అర్వింద్ విమర్శ

**హైదరాబాద్, మే 14 (అక్షర వెలుగు):** ట్విటర్ వేదికగా మంత్రి కేటీఆర్‌కు ఎంపీ ధర్మపురి అర్వింద్ కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ కుటుంబ పాలనను అంతమొందించడానికే అమిత్‌షా వస్తున్నారని అన్నారు. ఖాజీపేట రైల్వే కోచ్‌కు వివాదాస్పద భూములు ఎందుకిచ్చారని కేటీఆర్‌ను ఆయన ప్రశ్నించారు. గిరిజన వర్సిటీకి భూములెందుకు కేటాయించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. భువనగిరి ఎయిమ్స్‌ను ఇచ్చింది ఎవరో కేటీఆర్ తెలుసుకోవాలని సూచించారు. కేంద్రం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రతిపాదనలు పంపే ఓపిక టీఆర్ఎస్‌కు లేదన్నారు.

# అసమర్థ కెసిఆర్ సర్కార్‌ను పీకి అవతలపడేయండి



(మొదటి పేజీ తరువాయి..) భారీ బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. తెలంగాణలో కేంద్ర పథకాల పేర్లు మార్చడమే కానీ చేసిందేమిలేదన్నారు. కేంద్రం ఇచ్చిన సంక్షేమ పథకాలు కేసీఆర్ అమలుచేయాలని, వరంగల్ సైనిక్ స్కూల్‌కు 2016లో అనుమతి ఇచ్చామని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన లేదని షా చెప్పారు. తెలంగాణకు ఎనిమిదేళ్లలో రూ.2.52 లక్షల కోట్లు ఇచ్చామని అమిత్‌షా తెలిపారు. కేందరపథకాలకు తండ్రీకొడుకుల ఫోటోలు పెట్టుకుని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాము ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని అమిత్‌షా స్పష్టం చేశారు. అధికారంలోకి రాగానే ప్రతి గింజా కొంటామని తెలిపారు. తన మాటలు వింటుంటే కేసీఆర్‌కు భయం పట్టుకుందని అమిత్‌షా అన్నారు. బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు బండి సంజయ్ పాదయాత్ర చేయడం లేదని..దళితులు వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం యాత్ర జరుగుతోందని తెలిపారు. తెలంగాణలో నిజాంను మార్చేందుకు చేస్తోన్న యాత్రగా అభివర్ణించారు. రజాకార్ల ప్రతినిధుల ఒడిలో కూర్చున్న నేతలకు వ్యతిరేకంగా జరుగుతోందని, కుటుంబ పాలన కొనసాగిస్తున్న పాలనకు వ్యతిరేకంగా ఆయన పాదయాత్ర చేయడం జరుగుతోందన్నారు. వేలాది కోట్ల అవినీతికి పాల్పడిన టీఆర్ఎస్ ను కూకటి వేళ్లతో పెకిలించడానికి, మజ్లిస్ కి భయపడిన సీఎంను తొలగించేందుకు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దళితులను మోసం చేసిన టీఆర్ఎస్ తొలగించాలన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవం చేస్తామని చెప్పిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. తెలంగాణ ఎవరి జాగీరు కాదని, రాష్ట్రంపై అందరికీ సమానహక్కు ఉందని తెలిపారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని మార్చాలని కేసీఆర్ భావిస్తున్నారని బహిరంగ సభలో అమిత్ షా విమర్శించారు. తెలంగాణకు నీళ్లు, నిధులు, నియామకాలు ప్రజలకు అందించారా? అని ప్రశ్నించారు. కేవలం కుటుంబ పాలనే సాగుతుతోందన్నారు. మేం అధికారంలోకి రాగానే వాటిని అమలుచేసి చూపిస్తామని, దళితులకు మూడెకరాల భూమిని ఇస్తానని కేసీఆర్ వాగ్దానం చేశారని ఆరోపించారు. హైదరాబాద్‌లో కొత్తగా 4 సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ కట్టిస్తాం కేసీఆర్ అంటున్నారని, గాంధీ, ఉస్మానియా హాస్పిటల్స్‌లో పరిస్థితి ఒకసారి చూడాలని అమిత్‌షా ప్రజలకు సూచించారు. కేసీఆర్ మజ్లిస్ చంక ఎక్కికూర్చున్నారని, మజ్లిస్ పార్టీ అంటే కేసీఆర్‌కు భయమని, తెలంగాణ విమోచనదినం గురించి కేసీఆర్ వాగ్దానం చేశారా? లేదా అని షా ప్రశ్నించారు. టీఆర్ఎస్ కారు స్టీరింగ్ ఒవైసీ చేతిలో ఉందని, టీఆర్ఎస్, మజ్లిస్‌ను ఒకేసారి విసిరేయాలని ప్రజలకు షా పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని బెంగాల్ లా మారుద్దామని కేసీఆర్ భావిస్తున్నారని షా విమర్శించారు. సాయిగణెళిష్ హత్యపై ఏం సమాధానం చెబుతారని? ప్రశ్నించారు. తాము పంట కొనుగోలు చేస్తూనే ఉన్నామని, మద్దతు ధరలుకూడా గతంలో కన్నా ఎక్కవ పెంచామని అన్నారు. అయినా అబద్దాలుచెబుతూ ప్రజలనుమోసం చేస్తున్నారని మండిపడ్డారు.సర్దార్ వల్లభాయ్ పటేల్ కారణంగానే ఈరోజు ఈరాష్ట్రం భారత్‌లో భాగమైందని, తెలంగాణ కోసం పోరాడిన ప్రతీ ఒక్క మహనీయుడికి పేరు పేరునా శ్రద్ధాంజలి ఘటించారు అమిత్ షా. నీళ్లు, నిధులు, నియామకాలు.. ఏ హామీని టీఆర్ఎస్ పూర్తి చేయలేకపోయిందని, బీజేపీ అధికారంలోకి వస్తే అది పూర్తి అవుతుందని అమిత్ షా స్పష్టం చేశారు. దళితులతో పాటు అన్ని వర్గాల వాళ్లను కేసీఆర్ ప్రభుత్వం మోసం చేసింది. డబుల్ బెడ్ రూం ఇళ్లు, రైతులకు రుణమాఫీ అమలు కావడం లేదు. నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవు. అందుకే కేసీఆర్ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు యువత సిద్ధంగా ఉందని, హైదరాబాద్ నిజాంని మార్చాల్సిన అవసరం ఉందా? లేదా? అని పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఆయన మరోసారి గట్టిగా ప్రశ్నించారు. సర్పంచ్‌కు కూడా అధికారం ఇవ్వకుండా.. కొడుకు, బిడ్డకు అధికారం కట్టబెట్టారని కేసీఆర్‌పై మండిపడ్డారు. మన ఊరు-మన బడి నిధులు కేంద్రానివే. కేంద్ర ప్రభుత్వ పథకాలను.. రాష్ట్ర ప్రభుత్వ పథకాలుగా చిత్రీకరించారు. ఆయుష్మాన్‌భారత్ లాంటి పథకాన్ని తెలంగాణలో నడిపించడం లేదన్నారు అమిత్ షా. బంగారు తెలంగాణ చేస్తానన్న కేసీఆర్ అది చేయలేదు. అధికారమిస్తే ప్రతీ గింజను కొంటామని, సంక్షేమ హామీలన్నీ నెరవేరుస్తామని చెప్పారు. త్వరలోనే నిధులు వస్తాయి. నిరుద్యోగులకు ఉద్యోగాలు కూడా వస్తాయని అమిత్ షా పేర్కొన్నారు. అవకాశం ఇస్తే.. తెలంగాణలో డబుల్ ఇంజన్‌తో అభివృద్ధి చేసి చూపిస్తాం. సచివాలయానికి వెళ్లలేని కేసీఆర్‌ను ప్రజలే గద్దెదించుతారని అన్నారు. ఇకపోతే తెలంగాణకు ఇప్పటి వరకు 8 ఏళ్లలో 2లక్షల కోట్లకు పైగాకేంద్రం నిధులు ఇచ్చిందన్నారు.

## ఘనంగా పిడమర్తి రవి జన్మదిన వేడుకలు



**నల్గొండ, మే 14 (అక్షర వెలుగు):** చండూరు మండలంలో తెలంగాణ ఉద్యమకారుడు ఎస్సీ కార్పొరేషన్ మొదటి చైర్మన్ డాక్టర్ రవి జన్మదిన వేడుకలు మాదిగ జేఏసి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. అనంతరం మాదిగ జేఏసి జిల్లా అధ్యక్షులు కురుపాటి సుదర్శన్ మాట్లాడుతూ మల్లిదశ తెలంగాణ ఉద్యమంలో పిడమర్తి రవి పోరాటం వెలకట్టలేనిది అన్నారు. తన శ్రమను గుర్తించి యస్సీ, యస్టీ కమీషన్ చైర్మన్ పదవిని ఇవ్వాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ని కోరుతున్నానని అన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో యస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంటులో పెట్టి ఆమోదిస్తామని చెప్పిన బీజేపీ ఎనిమిది సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ వర్గీకరణ బిల్లు పార్లమెంటులో పెట్టకుండా మాదిగలను మోసం చేసిందని విమర్శించారు. పిడమర్తి రవి నాయకత్వంలో మాదిగ జేఏసి ఆధ్వర్యంలో కేసీఆర్ అండదండలతో కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి వర్గీకరణ సాధిస్తామని తెలిపారు. రహదారి బంగ్లాలో జరిగిన వేడుకల్లో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇరిగి గురునాథ్, మాదిగ విద్యార్థి జేఏసీ రాష్ట్ర కన్వీనర్ తలారి పరమేష్, దోనిపాముల సర్పంచ్ తిప్పర్తి దేవెందర్, ఇరిగి రామకృష్ణ, కురుపాటి లక్ష్మన్, మాస కృష్ణ, కురుపాటి గణేష్, ఇరిగి కుమార్, నలపరాజు యాదయ్య, గాదెపాక అర్జున్, దామెర కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మన ఊరు మన బడి కార్యక్రమంలో అన్ని పాఠశాలలను ఎంపిక చేయాలి: శివరాజ్




**చండూర్, మే 14 (అక్షర వెలుగు):** నాణ్యమైన విద్య సాధన కోసం కరోనా మహమ్మారి కాలంలో చదువుకు దూరమౌతున్న విద్యార్థులను పునఃరుద్ధరణ చేయాలని శనివారం చండూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో ఎస్ ఎం సి పోరం తెలంగాణ రాష్ట్ర కో కన్వీనర్ ఇరిగి నారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఉద్యమ నాయకుడు ఎర్ర శివరాజు, జిల్లా చైర్మన్ పగడాల నాగయ్య హాజరై వారు మాట్లాడుతూ కరోనా మహమ్మారి కారణంగా విద్యార్థులు పాఠశాలలకు దూరమై బాలకార్మికులుగా, బాలికలకు బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. 20 నుంచి 30 శాతం మంది బడికి దూరమైన వారిని యుద్ధ ప్రాతిపదికన తిరిగి బడులకు తీసుకురావాలని, ఆన్లైన్ విద్యాబోధన అర్థం కాక చాలా మంది విద్యార్థులు చదువులలో వెనకబడ్డారన్నారు. వారికి ప్రత్యేక విద్య బోధన ద్వారా తరగతి కి దగ్గ చదువును నేర్పాలని, అదేవిధంగా రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలను తిరిగి ప్రారంభించే నాటికి మౌలిక వసతులు పూర్తిస్థాయిలో చేపట్టాలని, మన ఊరు మన బడి కార్యక్రమంలో అన్ని పాఠశాలలను ఎంపిక చేసి ప్రతి పంచాయతీ కి 20 శాతం బడ్జెట్ కేటాయించాలన్నారు. మధ్యాహ్నం భోజనం సరుకులకు పెరిగిన చార్జీలకు తగ్గట్టు బడ్జెట్ కేటాయించాలని, విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతి తరగతి గదికి ఉపాధ్యాయుని నియమించాలనిన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి నాంపల్లి మండల కన్వీనర్ నేరెళ్ల సైదయ్య, రాం కోటి, దేవరకొండ వెంకన్న, గాదె పాక రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వల్పంగా తగ్గిన బంగారం,వెండి ధరలు

(మొదటి పేజీ తరువాయి..) ప్రస్తుత ధర రూ. 46,450గా ఉంది. నిన్న 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 51,490 ఉండగా ఇప్పుడది రూ. 50,670కి దిగొచ్చింది. విజయవాడలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 46,450గా ఉంది. ఇక 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 51,490గా ఉంది. ఇక విశాఖపట్నం లోనూ, హైదరాబాద్‌లోనూ విజయవాడ ధరలే కొనసాగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 46,450 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రా. బంగారం ధర రూ. 50,670గా ఉంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.46,450 ఉండగా, అదే 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.50,670గా ఉంది. చెన్నైలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.48,350 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.52,750గా ఉంది. కోల్‌కతాలో 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ..46,640 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.51,970గా ఉంది. బెంగళూరులో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.46,450 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.50,670గా ఉంది. పుణెళి, వడోదరాలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.46,680గా ఉంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.50,700గా ఉంది. కేరళలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ..46,450 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.50,670గా ఉంది. దాదాపుగా అన్ని ప్రధాన నగరాల్లో ఇంచుమించుగా ఇవే ధరలు కొనసాగుతున్నాయి.

## ఢిల్లీ అగ్నిప్రమాదం ఘటనలో ఇద్దరి అరెస్టు

(మొదటి పేజీ తరువాయి..)27 మంది సజీవ దహనమయ్యారు. మరో 12 మందికి గాయాలు కాగా సహాయ బృందాలు 50మందిని రక్షించాయి. మరికొందరు ప్రాణాలు రక్షించుకునేందుకు భవనం పైనుంచి కిందకు దూకారు. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 32కు చేరుకుందని సమాచారం. ప్రమాదం సమయంలో రెండో ఫ్లోర్ లో మోటివేషనల్ స్పీచ్ ఈవెంట్ జరుగుతుందని తెలిపారు అధికారులు. శనివారం ఉదయం సిఎం అరవింద్ కేజ్రీవాల్ ముండ్కాలో అగ్ని ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఘటనపై విచారాన్ని వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఢిల్లీ ప్రభుత్వం మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించిందని, నిందితులను విడిచిపెట్టబోమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ భవనంలో ఒకవైపు మాత్రమే మెట్లు ఉండటంతో ప్రజలు భవనం నుంచి తప్పించుకోలేకపోయారని అగ్నిమాపక శాఖ డివిజనల్ అధికారి తెలిపారు.

## ఆందోళనకరంగా దేశ ఆర్థిక వ్యవస్థ

(మొదటి పేజీ తరువాయి..) పరిణామాలను పరిశీలించినపుడు ఆర్థిక విధానాలను విభిన్నంగా మార్చడం గురించి పరిశీలించవలసిన అవసరం ఉందని చెప్పారు. గడచిన ఎనిమిదేళ్ళలో వృద్ధి రేటు మందగమనం ప్రస్తుత ప్రభుత్వ పనితీరుకు గొప్ప నిదర్శనమని చెప్పారు. కోవిడ్-19 మహమ్మారి తర్వాత ఆర్థిక వ్యవస్థ కోలుకోవడం నిర్లిప్తంగా ఉందని, నిలిచిపోయిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆర్థిక సంబంధాలను సమగ్రంగా సమీక్షించవలసిన సమయం ఆసన్నమైందన్నారు. వస్తు, సేవల పన్ను చట్టాలను మోదీ ప్రభుత్వం పేలవంగా రూపొందించిందని, జీఎస్టీ చట్టాలను 2017లో అనుచితంగా అమలు చేసిందని, ఆ పర్యవసానాలను ప్రతి ఒక్కరూ చూడవలసి వస్తోందని చెప్పారు. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి మునుపెన్నడూ లేనంతగా బలహీనపడిందన్నారు. ఈ విషయంలో అత్యవసర ఉపశమన చర్యలు అవసరమని చెప్పారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం 1991లో సరళీకరణ నూతన శకాన్ని ఆవిష్కరించిందని గుర్తు చేశారు. ఈ సరళీకరణ వల్ల దేశానికి గొప్ప ప్రయోజనాలు లభించాయని తెలిపారు. సంపద సృష్టి, కొత్త వ్యాపారాలు, నూతన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, మధ్య తరగతి ప్రజల సంఖ్య పెరుగుదల, లక్షలాది ఉద్యోగావకాశాలు, ఎగుమతులు, పదేళ్లలో 27 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడటం వంటి ప్రయోజనాలు చేకూరాయని చెప్పారు. 30 ఏళ్ళ తర్వాత జాతీయ, అంతర్జాతీయ పరిణామాలను పరిశీలించినపుడు, ఆర్థిక విధానాలను మార్చడం గురించి ఆలోచించవలసిన అవసరం కనిపిస్తోందని తెలిపారు. ఆర్థిక విధానాలను మార్చడం వల్ల అసమానతల పెరుగుదల, తీవ్ర పేదరికం వంటి సమస్యలకు పరిష్కారం లభించాలన్నారు. ప్రపంచ ఆకలి సూచీ 2021లో 116 దేశాల్లో మన దేశం 101వ స్థానంలో ఉందన్నారు. మహిళలు, బాలల్లో పోషకాహార లోపం తీవ్రంగా ఉందని తెలిపారు. ఆర్థిక వ్యవస్థపై బాహ్య పరిస్థితులు కూడా ప్రభావం చూపుతున్నాయని, ఈ పరిణామాలను ప్రభుత్వం గుర్తిస్తున్నట్లు కనిపించడం లేదని చెప్పారు. ఈ పరిణామాలను ఎదుర్కొనడానికి ఏం చేయాలో ఈ ప్రభుత్వానికి తెలిసినట్లు కనిపించడం లేదన్నారు. కాంగ్రెస్ మేధోమథనంలో మూడు రోజులపాటు జరిగే సమాలోచనలు, రానున్న రోజుల్లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీసుకునే నిర్ణయాలు ఆర్థిక విధానాలపై దేశవ్యాప్త చర్చకు దారి తీస్తాయన్నారు. నవ సంకల్ప చింతన్ శివిర్ పేరుతో శుక్రవారం ప్రారంభమైన కాంగ్రెస్ మేధోమథనం సమావేశాలు ఆదివారం వరకు జరుగుతాయి. ముసాయిదా ప్రకటనపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆదివారం చర్చిస్తుంది. ఈ మేధోమథనం సమావేశాల్లో ఆర్థిక రంగంపై కమిటీకి చిదంబరం నాయకత్వం వహిస్తున్నారు.

## విలేకరిపై గుర్తు తెలియని వాహనం ఢీ




**మెదక్, మే 14, (అక్షర వెలుగు):** బేగరి ప్రేమ్ కుమార్, వృత్తి రిత్యా విలేకరిగా న్యూస్ కవరేజీ కోసం వెళ్ళి వస్తుండగా శుక్రవారం ఏడుపాయల్ మార్గ మధ్యలో తూఫాన్ వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలైయ్యారు. ప్రస్తుతం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందు తున్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు తమ రోజు వారి కార్యకలాపాల్లో భాగంగా న్యూస్ రిపోర్టింగ్ సమయాల్లో ప్రమాదాలకు గురైతే ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని తెలంగాణ మీడియా వర్కింగ్ జర్నలిస్టు ఫోరమ్ అధ్యక్షుడు పృధ్వీరాజ్.జి, అక్షర వెలుగు ఎడిటర్ డిమాండ్ చేశారు. అక్షర వెలుగు పత్రికా ప్రతినిధులు.. ప్రమాదానికి గురైన సహచర జర్నలిస్టు ప్రేమ్‌కు ఫోన్ చేసి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

# వైన్స్... బెల్ట్ దోస్తీ...

- వైన్స్ లో నో స్టాక్
- బెల్ట్ షాప్ లో ఆల్ ఫ్రెండ్స్ దొరకబడును
- ఎనీ టైం అని బ్రాండ్ బెల్ట్ షాప్ లో
- బాటిల్ కి రూ. 50 నుంచి 80
- మామూళ్ల మత్తులో అధికారులు



**గణపురం, మే 14 (అక్షర వెలుగు):** మండల పరిధిలోని పలు గ్రామాల్లో బెల్ట్ షాపుల జోరు సాగుతోంది. ఏ చిన్న గ్రామానికి వెళ్లిన బెల్టు షాపులు యథేచ్ఛగా నడుస్తున్నాయి. ప్రధానంగా కిరాణా షాపులు హెరీటళ్లు మద్యం విక్రయా లకు కేంద్రబిందువుగా మారాయి. 24 గంటలు మద్యం అందుబాటులో ఉండటంతో యువత మద్యానికి బానిసగా మారుతూ పెడదారిన పడుతున్నారు. తమ పనులను మానుకొని ఉదయం నుంచి రాత్రి వరకు అక్కడే గడుపుతుండటంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. సంబంధిత అధికారులకు మామూళ్లు మత్తులో బెల్టుషాపులను పట్టించుకునే వారే కరువయ్యారని ఆయా గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అక్రమంగా నడుస్తున్న బెల్టుషాపులు గల్లీకి ఒకటి చొప్పున మండలంలో సుమారు 100 నుంచి 150 కి పైగానే ఉన్నాయి. బెల్ట్ షాపుల్లో ప్రతి బాటిల్ పై అదనంగా రూ. 50 నుంచి 80 వరకూ విక్రయాలు జరుపుతున్నారు. గ్రామంలో గల కిరాణాలు అడ్డాగా మారి 24 గంటలు మద్యం అందుబాటులో ఉండడంతో యువత మద్యానికి బానిస గా మారుతున్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగుతున్న వారిపై దాడులు జరుపుతున్న పోలీసులు కండ్ల ముందు నడుస్తున్న బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. మద్యం షాపుల యజమానులు కొంతమంది అధికారులకు మామూలు ముట్టజెప్పి బెల్టు షాపులను కొనసాగిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎవరైనా బెల్టుషాపులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే నామ్కేవస్తిగా వెళ్లి తనిఖీలు చేపట్టి కొంత మద్యం సీజ్ చేయడమే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. మామూళ్ల మత్తులో సంబంధిత ఆబ్కారీ, పోలీస్ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంతో బెల్టుషాపులకు కాసుల వర్షం కురుస్తోంది. ఇప్పటికైనా బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి వాటిని మూసివేసి కుటుంబాలను కాపాడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

### వైన్స్ షాపుల్లో నో స్టాక్...!

వైన్ షాప్ యజమానులు బెల్ట్ షాప్ వారు కలిసి కుమ్మక్కై బెల్ట్ దందాను నడిపిస్తూ మద్యం ప్రియులను బెంబేలెత్తిస్తున్నారు. షాప్ నుంచి మద్యం నేరుగా బెల్ట్ షాప్ కు అధిక ధరలకు అమ్ముతూ.. షాపునకు వచ్చిన మందు బాబులకు నో స్టాక్ అని చెబుతున్నారు. చేసేదేమిలేక మద్యం ప్రియులు బెల్ట్ షాప్ లను ఆశ్రయించి తమ జేబులను ఖాళీ చేసుకుంటున్నారు. రోజంతా కాయ కష్టం చేసి సంపాదించిన కూలీ డబ్బులు మద్యం కోసం ఖర్చు చేయడంతో వారి కుటుంబాల్లో తగాదాలకు దారి తీస్తోంది.

## కోమటిరెడ్డి సైకిల్ యాత్ర కు విశేష స్పందన

- వరంగల్ డిక్లరేషన్ పై నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి సైకిల్ యాత్ర
- సైకిల్ పై మూడు గ్రామాలను చుట్టేసి రైతులకు.. ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించిన కోమటిరెడ్డి
- ఆరెపల్లి దర్గాహ్ నుండి ప్రారంభమై తీగల గుట్టపల్లి మీదుగా వల్లంపహాడ్ గ్రామంలో ముగింపు



**కరీంనగర్, మే 14 (అక్షర వెలుగు):** వరంగల్ డిక్లరేషన్ పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఆరేపల్లి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తీగలగుట్టపల్లి మీదుగా వల్లంపహాడ్ వరకు రైతులను కలుసుకుంటూ సైకిల్ యాత్ర జోరుగా హుషారుగా కొనసాగింది. ఇటీవలే వరంగల్ లో జరిగిన రైతు సంఘర్షణ సభ లో కాంగ్రెస్ పార్టీ యొక్క చారిత్రక నిర్ణయం అయినటువంటి వరంగల్ డిక్లరేషన్ గురించి రైతులను మరియు సామాన్య ప్రజలను చైతన్యపరచి దాని పూర్తి వివరాలు రైతులకు, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తూ.. నినాదాలతో హెూరెత్తిస్తు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏక కాలంలో రైతులకు 2లక్షల రుణమాఫీ తో పాటు రైతులకు, కౌలు రైతులకు ఏడాదికి 15 వేల రైతు బంధు, రైతు కూలీలకు ఏడాదికి 12 వేల సాయం అందిస్తామని, రైతులు పండించిన వడ్లను క్వింటాలుకు 2500 రూపాయలు ఇచ్చి కొనుగోలు చేస్తామని, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి లు వరంగల్ సభలో డిక్లరేషన్ కు సంబంధించిన చెప్పిన ప్రతి అంశాన్ని కూలంకషంగా వివరించారు. నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్ర కు రైతులు, కూలీలు, సామాన్య ప్రజలు, మహిళా రైతులు, గృహిణి ల నుండి విశేష స్పందన వచ్చిందన్నారు. బిజెపి, టిఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలను, రైతులను చేస్తున్న మోసాలను గ్రామాల్లో ప్రజలే స్వయంగా తమ దృష్టికి తీసుకొచ్చి, వారి స్థాయిలో ఎదుర్కొంటున్న బాధలను చెప్పుకుంటూ ఆవేదన వెలిబుచ్చారన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ కే ఓటేస్తామని గ్రామాల్లో రైతులు, మహిళలు, ప్రజలు తమ మదిలో మాటను బయటపెట్టారని చెప్పారు. ఈ కార్యక్రమంలో..నాయకులు శ్రావణ్ నాయక్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, లింగంపెల్లి బాబు, దండి రవీందర్, కొరివి అరుణ్ కుమార్, పొరండ్ల రమేష్, ముక్క భాస్కర్, తమ్మడి ఏజ్రా, యం.డి.సలీమొద్దిన్, షహింషా, నదీమ్, యం.డి చాంద్, మేకల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యాటక, బౌద్ధ కేంద్రంగా బుద్ధవనం:రాష్ట్ర ఐ. టి.పురపాలన, పట్టణ అభివృద్ధి, పరిశ్రమల శాఖ మంత్రి కె. టి.ఆర్

సాగర్ లో మంత్రుల తో కలిసి బుద్ధవనం ప్రారంభించిన కె.టి.ఆర్



**నాగార్జున సాగర్, మే 14, (అక్షర వెలుగు):** నాగార్జున సాగర్‌లో ఏర్పాటు చేసిన బుద్ధ వనం ను ప్రపంచ స్థాయిలో అద్భుతంగా,ప్రముఖ బౌద్ధ క్షేత్రం గా,అన్ని హంగు లతో ఆకర్ష నీయంగా అభివృద్ధి చేయుటకు కృషి చేయనున్నట్లు రాష్ట్ర ఐ. టి.,పురపాలన,పట్టణ అభివృద్ధి,పరిశ్రమల శాఖ మంత్రి క్రె. తారక రామారావు అన్నారు.శనివారం నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ లో రాష్ట్ర ఐ. టి.పురపాలన,పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి కె.తారకరామారావు బుద్ధవనం ను మంత్రుల తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధవనం ను బుద్ధ వనం ప్రాజెక్ట్ స్పెషల్ ఆఫీచర్ మల్లేపల్లి లక్ష్మయ్య, కళా శిల్పి శివ నాగిరెడ్డి గారు ఈ ప్రాజక్టు కు చాలా కష్టపడ్డారని అన్నారు. ఈ ప్రాజక్టు నిర్మాణం కోసం పని చేసిన శిల్పులు, పాలు పంచు కొన్న వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.బుద్ధవనం ను ప్రముఖ పర్యాటక కేంద్రం గా,బుద్ధిస్ట్ సర్క్యూట్ గా అభివృద్ధి చేస్తే ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని అన్నారు., పర్యాటకుల .గౌతమ బుద్ధుడు మన భారత దేశం లో పుట్టడం గర్వకారణం అన్నారు. బుద్ధుని శిష్యులు ప్రచారం వలన బౌద్ధం చాలా దేశాలకు వ్యాపించిందని అన్నారు. ఈ ప్రాంతం లో నివసించిన ఆచార్య నాగార్జునుడు బుద్ధుని శిష్యుడు అని అన్నారు. మన రాష్ట్రంలో చాలా చోట్ల బౌద్ధ స్థూపాలు కనిపిస్తాయి.సూర్యాపేట జిల్లా ఫణిగిరి లో,ఖమ్మం జిల్లా నేల కొండ పల్లి లో,కరీంనగర్ జిల్లా ధూళి కట్ట లో బౌద్ధ స్థూపాలు,చైత్యాలు ఉన్నాయి అన్నారు.బుద్ధుని ప్రభోధనలు పాటించక పోవడమే సమాజం లో అవ లక్షణాలకు కారణం గా పేర్కొన్నారు. బౌద్ధులు మన దేశానికి తరలి వచ్చే విధంగా బౌద్ధారామాలు తీర్చిదిద్దాలి.రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్ర శేఖర్ రావు విజన్ కు అనుగుణంగా ఈ బుద్ధవనం ప్రాజక్టును తీర్చిదిద్ది నట్లు తెలిపారు. 274 ఎకరాలు ఉన్న ఇక్కడ, 90 ఎకరాలను మాత్రమే ఉపయోగించుకున్నట్లు,ఇంకా అన్ని హంగులతో అభివృద్ధి చేయటానికి అవకాశం ఉందని,ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు తో మాట్లాడి నిధులు కేటాయింపు మంజూరు కృషి చేస్తానని అన్నారు. ఇక్కడ బౌద్ధ యునివర్సిటీ ఏర్పాటు చేయాలని ఎవరైనా వస్తే తప్పకుండా పరిశీలిస్తాం అన్నారు.బుద్ధవనం ప్రపంచ పర్యాటక కేంద్రంగా,బుద్ధిస్ట్ సర్క్యూట్‌గా పిపిపి పద్ధతిలో అభివృద్ధి చేయటానికి ముందుకు వస్తున్నారు.ఈ దిశగా పర్యాటక శాఖ,జిల్లా యంత్రాంగం ప్రతి పాదనలు రూపొందించాలి అన్నారు.ఈ ప్రాంతం లో చాకలి గుట్టను పర్యాటక ప్రాంతంగా తీర్చి దిద్దాలి అన్నారు. బౌద్ధం విస్తారంగా అనుసరిస్తున్న దేశాల అంబాసిడర్లును,బౌద్ధ సన్యాసులు ను ఇక్కడ రప్పించి మన దగ్గర ఉన్న అవకాశాలను వారికి చూపించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు తో మాట్లాడి దలైలామా గారిని కూడా ఇక్కడకు రప్పించుకుందామని అన్నారు. ఫణి గిరిలో కూలిపోయిన స్థూపాలను పునః నిర్మించాలని అన్నారు. బుద్ధవనంలో మూడు కిలో మీటర్ల మేర సైక్లింగ్ ట్రాక్ నిర్మాణానికి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్,పర్యాటక,సాంస్కృతిక, క్రీడలు,యువజన శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్,రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జి. జగదీశ్ రెడ్డి, రాష్ట్ర హెూంశాఖ మంత్రి మహమూద్ అలీ,రాష్ట్ర విద్యా శాఖా మంత్రి సబితా ఇంద్రారెడ్డి, రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి కె. మల్లా రెడ్డి, రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి శ్రీనివాస్ యాదవ్,జడ్.పి.చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, ఎం.ఎల్.సి కోటి రెడ్డి, నాగార్జున సాగర్ శాసన సభ్యులు నోముల భగత్,జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్,రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్, రాష్ట్ర పర్యాటక సంస్థ ఎం.డి.మనోహర్,బుద్ధవనం స్పెషల్ ఆఫీసర్ మల్లే పల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు

## ఇల్లు దగ్ధమైన బాధితులకు ఆసరా



**ములుగు, మే 14, (అక్షర వెలుగు):** మంగపేట మండల కేంద్రంలోని శనగాకుంట గ్రామంలో గత 15 రోజుల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో ఆ గ్రామానికి చెందిన 23 ఇల్లు అగ్నికి ఆహుతి అయిన విషయాన్ని సోషల్ మీడియాలో చూసి తెలుసుకొని వారి మనస్సు చెల్లించి దయా హృదయులైన వారు అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన 40 కుటుంబాలకు ఒక్కొక్కరికి మూడు జతల బట్టలు అంటే సుమారుగా 50,000 రూపాయల విలువచేసే బట్టలు హైదరాబాద్ చైతన్య కాలేజీ కి చెందిన ఓల్డ్ స్టూడెంట్స్ నీరజ స్వర్ణలత చంద్రశేఖర్ రమేష్ కుమార్ సురేష్ అజయ్ కళ్యాణ్ కిరణ్ మరియు ములుగు జిల్లా టి.ఎస్.ఎస్.పి 5వ బెటాలియన్ కు చెందిన ఆర్.ఐ కృష్ణ ఏ ఆర్.ఎస్.ఐ శ్రీనివాస్ సహాయ సహకారాలతో పాటు అక్షర వెలుగు విలేకర్ వెంకటేష్ సహాయ సహకారాలతో శనగకుంట గ్రామ బాధితులకు బట్టలు అందించడం జరిగింది వీరి పట్ల శనగాకుంట గ్రామానికి చెందిన బాధితులు సంతోషాన్ని వ్యక్తం చేయడం జరిగింది

## గడపగడపకు వెళ్లి సీఎం సహాయనిధి చెక్కులను ఇవ్వడం సంతోషంగా ఉంది

-ప్రశాంత్ కుమార్ రెడి



**ఇబ్రహీంట్నం, మే 14, (అక్షర వెలుగు):** యాచారం మండలం నందివనపర్తి గ్రామంలో సీఎం సహాయనిధికి అర్జీ పెట్టుకున్న వారికి చెక్కులు రావడంతో గ్రామ అధ్యక్షులు పంది సుధాకర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి ఇంటింటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని చెక్కులు పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్రం దేశంలోని ఎవరు చేయని సేవలు చేస్తుందని ఆడపడుచులకు అండగా కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, దళిత బంధు ,రైతుబంధుతో పేద వారిని ఎంతో ఆదుకుంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్ పి టి సి చిన్నోల్ల జంగమ్మ, గ్రామ సర్పంచ్ కంబాలపల్లి ఉదయశ్రీ, యాచారం తెరాస మండల అధ్యక్షులు కర్నాటి రమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పాచ్చ భాష, మాజీ సర్పంచ్ రాజు నాయక్, బి.ఎన్.రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్ రెడ్డి, సహకార సంఘం చైర్మన్ రాజేందర్ రెడ్డి, వార్డ్ మెంబర్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ హామీలన్నీ బూటకం

(మొదటి పేజీ తరువాయి..) తెలంగాణకు వస్తున్న అమిత్‌షాకు రేవంత్‌రెడ్డి తొమ్మిది ప్రశ్నలు సంధించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్ర ముగింపు సందర్భంగా తుక్కుగూడలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా రావడాన్నిపురస్కరించుకుని టిపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ రాస్తూ పలు ప్రశ్నలు సంధించారు. కేసీఆర్ కుటుంబ అవినీతిని ఉపేక్షించడం వెనుక రహస్యమేంటనిప్రశ్నించారు. పంట కొనుగోలు చేయకుండా ఆడిన రాజకీయ డ్రామాలు. ధాన్యం రైతుల మరణాలకు బాధ్యులెవరని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో తెలంగాణ ఏర్పాటుపై అనుచితంగా మాట్లాడిన మోదీ వ్యాఖ్యలపై వివరణ ఇచ్చి క్షమాపణ చెప్పాలన్నారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డు అంటూ మాట తప్పారని గుర్తు చేశారు. .విభజన చట్టంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీసారు. భద్రాద్రి రాముడికి రామాయణం సర్క్యూట్‌లో చోటు ఏదని,అయోధ్య రాముడు.. భద్రాద్రి రాముడు మీ దృష్టిలో ఒకటి కాదా అంటూ రేవంత్ లేఖలో ప్రశ్నల వర్షం కురిపించారు. ఎనిమిదేళ్లుగా కేసీఆర్ కుటుంబ అవినీతిని ఉపేక్షించడం వెనుక రహస్యం ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. 7,500 కి.మీ. సాగే ఈ సర్క్యూట్‌లో భద్రాద్రి రాముడికి చోటు దక్కలేదు. అయోధ్య రాముడు, భద్రాద్రి రాముడు మీ దృష్టిలో ఒక్కరు కాదా?ఒడిశాలోని నైనీ కోల్ మైన్స్ టెండర్ విషయంలో జరిగిన అవినీతిపై ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి నేను స్వయంగా కేంద్ర బొగ్గుశాఖ మంత్రి, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాను. ఈ కుంభకోణం వెనుక కేసీఆర్ కుటుంబ పాత్రపై వివరాలు సమర్పించాం. ఇంత వరకూ దీనిపై అతీగతీ లేదు. కారణం ఏమిటి? కేసీఆర్ అవినీతి విషయంలో మీరు నిజంగా అంత సీరియస్‌గా ఉంటే.. అది చేతల్లో ఎందుకు కనిపించడం లేదు?పొరుగున ఉన్న కర్ణాటకలో అప్పర్ భద్ర ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చారు. తెలంగాణలో రెండు ప్రధాన ప్రాజెక్టుల్లో ఒక్క దానికి కూడా జాతీయ హోదా ఇవ్వాలన్న ఆలోచన మీకు రాలేదు. మీ దుర్మార్గ చట్టాలకు తెరాస మద్దతు.. వారి అక్రమాలు అవినీతికి మీ మద్దతు.. ఇదే కాదా ఎనిమిదేళ్లుగా జరిగింది. 2014లో కాంగ్రెస్ అధికారం నుండి దిగిపోయే నాటికి పెట్రోల్ ధర రూ.71.41 పైసలు, డీజిల్ ధర రూ.55.49 పైసలు. గ్యాస్ సిలిండర్ ధర రూ.470 ఉన్నది. నేడు పెట్రోల్ లీటర్ ధర రూ.119.66 పైసలు, లీటర్ డీజిల్ ధర రూ.105.65 పైసలు. గ్యాస్ సిలిండర్ ధర రూ.1,052కి ఎగబాకాయి. ఇంతలా జనాలను పన్నులు, సెస్సులతో చావగొట్టే మిమ్మల్ని మా తెలంగాణ ప్రజలు ఎందుకు క్షమించాలని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

## ఘనంగా శ్రీ లక్ష్మీ నరసింహ్మా స్వామి కళ్యాణ మహోత్సవం



**ఇబ్రహీంపట్నం, మే 14, (అక్షర వెలుగు):** ఇబ్రహీంపట్నం గ్రామములో స్వయంభువుగా గుట్టపై వెలసి యున్న శ్రీ లక్ష్మీ నరసింహ్మా స్వామి వారి దేవస్థానములో 14 వ తేదీ శనివారము నాడు స్వామి వారి కళ్యాణ మహోత్సవము అత్యంత వైభవంగా, ఆలయ కార్యనిర్వహణాధికారి దేవరశెట్టి ప్రవీణ్ కుమార్ పర్యవేక్షణలో యాదాద్రి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ ఉ.వే. నలండిగల్ లక్ష్మినరసింహ్మ ఆచార్యులు శ్రీమాన్ ఉ.వే పరావస్తు రంగాచార్యులు, ఆలయ అర్చకులు బర్కం లక్ష్మణాచార్యులు ఆధ్వర్యములో , ఆలయ భక్త బృందం మరియు భజన మండలి వారి సకహారముతో అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగినది . ఈ కళ్యాణ మహోత్సవమునకు స్థానిక ఇబ్రహీంపట్నం నియోజకవర్గం శాసన సభ్యులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి , ఇబ్రహీంపట్నం పురపాలక సంఘం ఛైర్మన్ , వైస్ ఛైర్మన్ మరియు జై శ్రీ రామ్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు హాజరై శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవములో పాల్గొనడం జరిగింది.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్లెల కుమార స్వామి



**ములుగు, మే 14, (అక్షర వెలుగు):** ములుగు మండల కేంద్రంలోని జివాంతారావుపల్లి గ్రామానికి చెందిన కొండబోయిన శంకర్ కూతురి వివాహానికి హాజరై నూతన వదు వరులనుఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నల్లెల కుమారస్వామి కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు గొల్లపెల్లి రాజేందర్ గౌడ్ యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బానోత్ రవిచందర్ మండల అధ్యక్షులు ఎండీ చాంద్ పాషా స్థానిక సర్పంచ్ రత్నం భద్రయ్య కొండల్ రెడ్డి మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి ఎండీ అజ్జు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కుక్కల నాగరాజు యూత్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి వంశీ కృష్ణ గ్రామ కమిటీ అధ్యక్షులు గుండ భిక్షపతి వార్డు సభ్యులు రవి శ్రీధర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ పార్టీ యూత్ మండల ప్రధాన కార్యదర్శి అజ్మద్ వివాహ కార్యక్రమానికి హాజరై ఆశీర్వదించిన ములుగు ఎమ్మెల్యే సీతక్క తనయుడు సూర్య



**ములుగు, మే 14, (అక్షర వెలుగు):** ఏటూరునాగారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రధాన కార్యదర్శి వివాహ కార్యక్రమానికి హాజరైన ములుగు ఎమ్మెల్యే సీతక్క గారి తనయుడు సూర్య సూర్య ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చిటమట రఘు ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్న ఎల్లయ్య జిల్లా మైనారిటీ నాయకులు ఖలీల్ ఖాన్ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి గౌస్ మండల ఉపాధ్యక్షులు గీయా మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వసంత శ్రీనివాస్ కార్యదర్శి గద్దల నవీన్ టౌన్ కార్యవర్గ కార్యదర్శి సరికొప్పుల శ్రీనివాస్ టౌన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లక్కీ ముస్తఫా గణేష్ ప్రశాంత్ విక్రమ్ రమేష్ గున్నూ కుష్ కుమార్ సునీల్ హరి ప్రశాంత్ ప్రకాష్ బాలు రాజబాబు యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన ఏఐటియుసి కార్మిక సంఘ నాయకులు



**ములుగు, మే 14, (అక్షర వెలుగు):** మండల కేంద్రంలోని కాసిందేవిపేట గ్రామంలో ఈ మధ్యలో కటుకూరి శామ్యూల్ అనే ఇంటి పెద్ద చిన్న వయసులోనే చనిపోవడం బాధాకరం వారి భార్య సుమలత గారిని మరియు సామ్యూల్ తండ్రిగారిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఏఐటీయూసీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ గారు శ్రీనివాస్ ప్రవీణ్ గారల సహకారంతో వారి కుటుంబానికి కార్మిక సంఘం ఆధ్వర్యంలో బియ్యం సహాయం చేయడం జరిగినది అలాగే వారి కుటుంబానికి కార్మిక శాఖ ద్వారా రావలసిన లక్షా 30 వేల రూపాయలు అందించే విధంగా అధికారులతోని సంప్రదించి సహకారం అందిస్తామని అలాగే వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని తెలియజేస్తూ పేద కుటుంబం అయినందున ఇద్దరు చిన్న పిల్లల తల్లి కి నివశించడానికి ఇల్లు కూడా లేనందున ప్రభుత్వం వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించి ఆర్థిక సహాయం అందించవలసిందిగా కోరుచున్నాము ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గుంజె శ్రీనివాస్ మరియు ధుగ్యాల ప్రవీణ్ గారు కటుకూరి అశోక్ కటుకూరి కుమార్ గార్లు పాల్గొన్నారు అలాగే ధాతలు చిన్న పిల్లల తల్లి అయిన కటుకూరి సుమలత ని పెద్ద మనసుతో ఆదుకోవాలని విజ్ఞప్తి చేయనైనది.

## పసుపుబోర్డు చుట్టూ జిల్లా రాజకీయాలు



(మొదటి పేజీ తరువాయి..) మూడేళ్ళు దాటినా హామీ సంగతి మరిచాడని అంటూ ఎమ్మెల్సీ కవిత మొదలు, టిఆర్ఎస్ నేతలంతా ఎక్కడికక్కడ నిలదీయడం, రైతులతో ఆందోళనలుచేయించడంతో జిల్లాలో అగ్గి రాజుకుంటోంది. ఊపిరిసలపనివ్వని వాడీవేడి విమర్శలతో ధర్మపురి అర్వింద్‌పై టీఆర్ఎస్ విరుచుకుపడుతోంది. మూడేళ్ళుగా అర్వింద్ తనకు ఎదురులేనట్టుగా దూసుకువెళ్లారు. కానీ మరోసారి కవిత ఎంట్రీతో ఇప్పుడు నిజామాబాద్‌లో పొలిటికల్ హీట్ పెరుగుతోంది. అయితే బాండ్‌పేపర్‌పై రాసిచ్చిన హామీని అర్వింద్ నెరవేర్చలేకపోయారనే విషయాన్ని జనంలోకి తీసుకువెళ్లడంలో కవిత సక్సెస్ అయ్యారని టీఆర్ఎస్ శ్రేణులు సంబరపడు తున్నాయి. ఈ క్రమంలో ఎవరు పైచేయి సాధిస్తారన్నది చూడాలి. ప్రధానంగా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అర్వింద్ ను ఢీకొనడానికి, పార్టీ శ్రేణులను ఉత్సాహపరచడానికి ఆమె వేగం పెంచినట్లుగా స్పష్టమవుతోంది. ఈ క్రమంలోనే నియోజకవర్గాల వారీగా కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తున్నారు. ఎమ్మెల్యేల నేతృత్వంలో బీజేపీపై తిరుగుబాటుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అన్నిటికీ మించి బీజేపీ వైపు ఆకర్షితులవుతున్న కొందరు ఎమ్మెల్యేలు, ద్వితీయ శ్రేణి నేతలకు చెక్ పెడుతున్నారు. ఇంటిని చక్కదిద్దుకునే పనులను కవిత వేగంగా చేపట్టారు.




# చలన చిత్రం

## త్వరలో థాంక్యూ టీజర్




మనం వంటి సూపర్‌హిట్ తరువాత హీరో నాగచైతన్య - డైరెక్టర్ విక్రమ్‌కుమార్ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం థాంక్యూ. ఈ మూవీని జూలై 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లుగా నిర్మాత దిల్‌రాజు ఆఫీషియల్‌గా ప్రకటించారు. రాశిఖన్నా, మాళవిక నాయర్ హీరోయిన్‌లుగా నటిస్తున్న ఈ మూవీకి తమన్ మ్యూజిక్ అందిస్తుండగా ప్రముఖ సినిమాటోగ్రాఫర్ పీసీ శ్రీరామ్ కెమెరామెన్ గా పనిచేస్తున్నారు. ఈ మూవీ టీజర్ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

## జూలైలో చిత్రీకరణకు సిద్ధంగా విజయ్ సినిమా



హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్‌తో లైగర్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా విడుదల కాకముందే ఈ క్రేజీ కాంబోలో రెండో ప్రాజెక్టు జీజేఎం (జనగణమన) కూడా లాంచ్ అయింది. ఛార్మీ, వంశీపైడిపల్లి, పూరీ జగన్నాథ్ ఈ చిత్రాన్ని సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. కాగా ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ ఇపుడు ఫిలింనగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. జులై నుంచి షూటింగ్ మొదలు కానుంది. ఇంకో ఇంట్రెస్టింగ్ విషయమేంటంటే ఈ చిత్రంలో పూజాహెగ్డే విజయ్ దేవరకొండతో రొమాన్స్ చేయబోతుందట. ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించేందుకు పూజాహెగ్డే గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని టాక్. ఇదే నిజమైతే సిల్వర్ స్ర్కీన్‌పై పూజా-విజయ్ జోడీ ఎంటర్‌టైన్ చేయడం పక్కా అయిపోయినట్టే. మేకర్స్ ముందుగా జాన్వీకపూర్‌ను తీసుకోవడానికి ప్రయత్నాలు చేసినా..వర్కవుట్ కాలేదని తెలుస్తోంది. పాన్ ఇండియా స్టోరీతో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో రిలీజ్ చేయబోతున్నారు. ఆర్మీ, వార్ నేపథ్యంలో సాగనున్న ఈ చిత్రం 2023 ఆగస్టు 3న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.






## వసూళ్లలో దూసుకుపోతున్న సర్కార్ వారిపాట

### గ్యాప్‌లో ఫారిన్ టూర్‌కు వెళ్లనున్న మహేశ్ బాబు

మహేశ్ బాబు తన సినిమాలకి ఎంత ప్రాధాన్యతనిస్తాడో.. తన ఫ్యామిలీకి కూడా అంతే ప్రాముఖ్యత నిస్తాడు. తన ప్రాజెక్టుల విషయంలో ఆయన ఎంతమాత్రం తొందరపడడు. ఒకేసారి రెండు .. మూడు ప్రాజెక్టులను పట్టాలెక్కించాలనే ప్రయత్నంలో హడావిడి పడిపోవడం ఆయనకి తెలియదు. సినిమా తరువాత సినిమాను ఆయన కూల్ గా చేస్తూ వెళతారంతే. సినిమాకి సినిమాకి మధ్యలో ఫ్యామిలీతో విదేశాలకి వెళ్లిరావడం ఆయన అలవాటు. ఒక్కోసారి చేస్తున్న సినిమా నుంచి లాంగ్ బ్రేక్ దొరికినా వెంటనే ఆయన ఫారిన్ ట్రిప్ ను ఎ÷-లాన్ చేస్తాడు. ఎక్కువగా ఆయన యూరప్ దేశాలకి వెళుతుంటాడు. ఈ సారి ఆయన యూఎస్‌ఏ వెళ్లడానికి సన్నాహాలు చేసుకుంటున్నాడు. మహేశ్ బాబు తాజా చిత్రమైన 'సర్కారువారి పాట' ఈ నెల 12వ తేదీన భారీ స్థాయిలో విడుదలైంది. తొలి రోజున భారీ ఓపెనింగ్స్ తో ఈ సినిమా మొదలైంది. యాక్షన్ .. ఎమోషన్ కి మధ్య వచ్చిన పాటలు ఈ సినిమాలో కీలకమైన పాత్రను పోషించాయి. ప్రతి పాట కూడా ఇటు యూత్ ను .. అటు మాస్ ఆడియన్స్ ను ఆకట్టుకుంటూ సాగింది. వీకెండ్ తరువాత సినిమాకి వచ్చే రెస్పాన్స్ ప్రధానం. ఈ నేపథ్యంలో వచ్చే వారం ఫారిన్ వెళ్లడానికి మహేశ్ బాబు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నెల చివరికి ఆయన మళ్లీ ఇండియాకి తిరిగి రానున్నారు. ఆ తరువాత సినిమాను ఆయన త్రివిక్రమ్ తో చేయనున్నాడు. ప్రస్తుతం అందుకు సంబంధించిన సన్నాహాలు జరుగుతున్నాయి. త్రివిక్రమ్ తో మహేశ్ బాబు చేస్తున్న మూడో సినిమా ఇది. అందువలన అభిమానులందరిలో ఒక రేంజ్ లో క్రేజ్ ఉంది. ఇటు త్రివిక్రమ్ మార్క్‌కి తగినట్టుగా .. అటు మహేశ్ బాబు స్టైల్ కి తగినట్టుగా ఈ సినిమా ఉంటుందని అంటున్నారు. ఈ సినిమాలో కథానాయికగా పూజ హెగ్డే అలరించనుంది. ఆల్రెడీ ఆమె త్రివిక్రమ్ తో రెండు సినిమాలు .. మహేశ్ బాబుతో ఒక సినిమా చేసేసి ఉంది. జూన్ 28వ తేదీ నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగు మొదలుకానుంది. ఆ తరువాత సినిమా రాజమౌళితో ఉండనుంది. మహేశ్ బాబు కెరియర్లోనే ఫస్టు పాన్ ఇండియా సినిమా ఇది. అత్యధిక బ్జడెట్ తో నిర్మితం కానున్న ఫస్టు మూవీ ఇది. ప్రస్తుతం రాజమౌళి ఈ ప్రాజెక్టుపైనే గట్టిగానే కసరత్తు చేస్తున్నారు. త్వరలోనే మిగతా వివరాలు తెలియనున్నాయి. ఇకపోతే సర్కారు వారి పాట బాక్సాపీస్ వద్ద సక్సెస్ టాక్‌తో స్ర్కీనింగ్ అవుతోంది. రెండో రోజుల కలెక్షన్లకు సంబంధించిన అప్ డేట్ ఇపుడు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. తాజా అప్ డేట్ ప్రకారం నైజాంలో సర్కారు వారి పాట రెండు రోజుల్లో రూ.5.2 కోట్లు వసూలు చేసినట్టు ట్రేడ్ సర్కిల్ టాక్.



## హరీష్, రామ్ తొలి కాంబోతో సినిమా

టాలీవుడ్‌లో ఓ క్రేజీ కాంబో సెట్ అయిందా..! అంటే ప్రస్తుతం సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు చూస్తే అవుననిపిస్తోంది. ఎనర్జిటిక్ హీరో రామ్ పోతినేని స్టార్ డైరెక్టర్ హరిష్ శంకర్ కాంబినేషన్‌లో సాలీడ్ మాస్ ఎంటర్ టైనర్ తెరకెక్కనుందని తాజా సమాచారం. రామ్ ఎనర్జీని దృష్టిలో పెట్టుకొని పక్కా కమర్శియల్ అంశాలతో అదిరిపోయే స్క్రిప్ట్ సిద్ధం చేసినట్టు ఫిల్మ్ సర్కిల్స్‌లో టాక్ వినిపిస్తోంది. 'ఇస్మార్ట్ శంకర్' భారీ హిట్ తర్వాత మళ్ళీ అలాంటి మాస్ హిట్ కొట్టాలని 'రెడ్'చిత్రాన్ని చేస్తే అదికాస్త బెడిసికొట్టింది. దాంతో ఈసారి మళ్ళీ హిట్ కొట్టాలనే కసితో కోలీవుడ్ యాక్షన్ చిత్రాల దర్శకుడిగా పేరున్న ఎన్. లింగుస్వామి దర్శకత్వంలో 'ది వారియర్' అనే యాక్షన్ మూవీని చేస్తున్నాడు. తెలుగుతో పాటుగా తమిళంలోనూ ఈ మూవీ త్వరలోనే రిలీజ్ కానుంది. ఈ మూవీలో హీరోయిన్స్‌గా కృతిశెట్టి , అక్షర గౌడ..ఇతర కీలక పాత్రల్లో ఆదిపినిశెట్టి, నదియా కనిపించబోతున్నారు. అలాగే, మాస్ చిత్రాల దర్శకుడు బోయపాటి శ్రీను దర్శకత్వంలో కూడా ఎనర్జిటిక్ స్టార్ ఓ యాక్షన్ చిత్రాన్ని చేస్తున్నాడు. ఈ క్రమంలోనే హరీష్ శంకర్ దర్శకత్వంలో ఒక సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడట.ప్రస్తుతం పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ భవదీయుడు భగత్‌సింగ్ చిత్రాన్ని చేయాల్సి ఉంది. జూలై నుంచి ఈ సినిమాను సెట్స్ మీదకు తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బ్జడెట్‌తో నిర్మించనున్న ఈ సినిమాలో పవన్ సరసన మోస్ట్ వాంటెడ్ బ్యూటీ పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించబోతుంది. దీని తర్వాత రామ్ - హరీష్ శంకర్‌ల సినిమా మొదలయ్యే అవకాశాలున్నాయి. త్వరలో ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అఫీషియల్ కన్‌ఫర్మేషన్ రానుందని తెలుస్తోంది.

## భలే భలే బంజారా' ఫుల్ సాంగ్ విడుదల



చిరంజీవి, రామ్‌చరణ్ నటించిన తాజా చిత్రం 'ఆచార్య'. కొరటాల శివ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. కొణిదెల ప్రొడక్షన్స్, మ్యాట్నీ ఎంటర్‌టైన్మెంట్ కలిసి సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించింది. ఏప్రిల్29న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మిక్స్‌డ్ టాక్‌ను తెచ్చుకుంది. ఇక త్వరలోనే ఈ మూవీ ఓటీటీలో సందడి చేయబోతోంది. ఇదిలా ఉంటే విడుదలకు ముందు విడుదలైన ఆచార్య పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. మణిశర్మ అందించిన సంగీతం, ఆయన కట్టిన బాణీలకు సంగీత ప్రియుల నుంచి అనూహ్యమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ నేపథ్యంలో తాజాగా ఆచార్యలోని 'భలే భలే బంజారా' ఫుల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. నక్సలైట్లుగా ఉన్న ఆచార్య-సిద్ధ బృందంపై రాత్రివేళలో గిరిజన గూడెంలో చిత్రీకరించిన పాట ఇది. అడవీ ప్రాంతంలో ఓ వెన్నెల రాత్రిలో నక్సలైట్స్ సరదాగా ఆడిపాడితే ఎలా ఉంటుందనేది ఈ పాటలో చూపించారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యాన్ని అందించిన ఈ పాటకు మణిశర్మ సంగీతం అందించారు. శంకర్ మహదేవన్, రాహుల్ సిప్లిగంజ్ ఆలపించిన ఈ సాంగ్‌కు శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు.





## విభిన్న కథాంశంతో నటరత్నాలు సినిమా

కంటెంట్‌లో దమ్ముంటే చిన్న సినిమాలను కూడా ఆదరిస్తారు తెలుగు ప్రేక్షకులు. అందుకే టాలీవుడ్‌లో చోటా సినిమాలు భారీగా వస్తుంటాయి. డిఫరెంట్ స్టోరీలపై ఆడియన్స్ ఇంట్రెస్ట్ చూపుతున్న నేపథ్యంలో.. యంగ్ డైరెక్టర్స్ అలాంటి కథలతో సినిమాలను తెరకెక్కించి, విజయాన్ని సొంతం చేసుకుంటున్నారు. తాను కూడా అలాంటి డిఫరెంట్ కథతోనే 'నటరత్నాలు'తెరకెక్కిస్తున్నానని చెబుతున్నాడు దర్శకుడు గాదె నాగభూషణం. ఎన్.ఎస్ నాగేశ్వర రావు నిర్మాణంలో రూపుదిద్దుకోనున్న వినూత్న కథాంశం 'నటరత్నాలు'. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా సాగుతున్నాయి. అతిత్వరలో పూజా కార్యక్రమాలతో ఘనంగా సినిమా ప్రారంభోత్సవం చేయబోతున్నారు. కథ, స్క్రీన్ ప్లే, మాటలు, దర్శకత్వ పరివేక్షణ నర్రా శివ నాగు వహించగా ఎవరెస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై తెరకెక్కనున్న ఈ సినిమాకు ఆనందాసు శ్రీ మణికంఠ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సుదర్శన్, రంగస్థలం మహేష్, అర్జున్ తేజ్,డా భద్రం, తమిళ నటుడు శేషాద్రి, తదితరులు ముఖ్యపాత్రల్లో కనిపించనున్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులు కనెక్ట్ అయ్యేలా క్రైం, థ్రిల్లర్, మిస్టరీ నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. చిత్రంలో కామెడీ పార్ట్ హైలైట్ అయ్యేలా, ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వుకునేలా కథకు తెరరూపమివ్వబోతున్నారట. జూన్ మొదటివారంలో ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి త్వరత్వరగా ఫినిష్ చేసేలా ఎ÷-లాన్ రెడీ చేసుకున్నామని చిత్ర యూనిట్ పేర్కొంది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com